# బారసాల కథ

"మీ అమ్మగారు వచ్చారు" అంది గేటు దగ్గర ఆటో దిగిన వ్యక్తిని చూసి రూప. నడినెత్తిన కొప్పు, దానికి బంగారు పిన్నులు, తోటీలు, మైసూరు సిల్క్ చీరలో అందంగా మోడర్న్‌గా ఉంది రూప.

ఆశ్చర్యంగా ఎదురు వెళ్ళాడు రవి. అందమైన సఫారీ, మైనర్ చైన్, బ్రాస్‌లెట్, రవి కూడా అందానికి, ఆధునికత్వానికి ప్రతీకలా వున్నాడు. అందమైన జంట వాళ్ళది. వాళ్ళకొక బాబు పుట్టాడు. వాడి బారసాల ఈరోజు.

"బావుండావురా అబ్బీ" అంటూ ఆప్యాయంగా పలకరించింది వెంకమ్మ. "ఆ బావున్నానమ్మా" అంటూ తల్లిని దింపాడు. ముచ్చట ముడి, మడమల మీదికి నేత చీర, నుదుటన పచ్చబొట్టు, కాశికాయ గుళ్ళు, వెనుకబడ్డ తరగతికి, పల్లెటూరి ఆకారానికి, ఆప్యాయతకి, యాసకి నిదర్శనంగా ఉంది వెంకమ్మ. చేతిలో గుడ్డసంచీ, ట్రంకు పెట్టె. "రామ్మా, ఎలా వచ్చావు" అన్నాడు. హాలులో పార్టీ మొదలయింది. ప్రక్క గుమ్మంలోంచి బెడ్ రూమ్‌లోకి తీసుకెళ్ళాడు.

"స్నానం చెయ్యమ్మా" అన్నాడు. "బాగున్నారా అత్తయ్యా" అంటూ వచ్చింది రూప. "ఆ బాగుండానమ్మా" అంది కళ్ళార్పకుండా చూస్తూ, ఆపాటి పలకరింపుకే పొంగిపోతూ "లచ్చిం తల్లిలా వున్నావు" అంది మెటికలు విరుస్తూ ప్రేమగా.

"రవీ. ఆలార్ వెయిటింగ్" అంటూ వెళ్ళిపోయింది రూప.

"అక్కడంతా మొదలయినట్లుందిగా, పదరా అబ్బీ" అంది వెంకమ్మ. "అలాగే. ఇల్లు చూద్దువుగానిరా" అంటూ హాలు తప్ప మిగతావి తిప్పాడు. దొడ్లో వంటలవుతున్నాయి. వంటవాళ్ళు అప్పుడే పొయ్యి బాగా మండటానికి కొంచెం నూనె పొయ్యిలో వేశారు. "అదేమిట్రా నూనె అలా పోస్తున్నారు" అంది వెంకమ్మ లబలబలాడుతూ.

"వాళ్ళు అంతేనమ్మా. నేను, రూపలిక్కడ గెస్టులని రిసీవ్ చేసుకుంటున్నాము కదా. ఇక వాళ్ళిష్టం వచ్చినట్టు చేస్తున్నారు. ఎవరున్నారు చూడటానికి అవన్నీ శ్రద్ధగా" అన్నాడు.

వెంకమ్మ మనస్సు కరిగింది. "వెట్టి నాగన్నా. నేనొచ్చానుగా. నేను చూసుకుంటాలే. మీరు అక్కడ చూసుకోండి" అంది. రవి ఆనందంగా వెళ్ళిపోయాడు. "ఆవిడేది" అంది రూప మెల్లగా. "ఆవిడకిష్టమయిన వంటశాల చూపించాను" అన్నాడు సన్నగా కన్ను గీటుతూ రవి. రూప నిట్టూర్చింది.

పార్టీ బాగా జరిగింది వెంకమ్మ పర్యవేక్షణలో వంట చేయిస్తున్నా వెంకమ్మ మధ్య మధ్యలో హాలువైపు తొంగి చూస్తూనే వుంది, కొడుకేమైనా రమ్మంటాడేమోనని. పిలుపు రాలేదు. "మీ పేరెంట్స్ ఎవరూ రాలేదా" అన్నాడు రవి ఫ్రెండ్ మంత్రి కమ్ యాక్టర్. విననట్లు నటించాడు రవి. "పొలం పనులు" నసిగింది రూప. అత్తమామల్ని పరిచయం చేశాడు.

"నేను రేపు వెళ్తామరా అబ్బాయి" అంది వెంకమ్మ. ట్రంకుపెట్టె లాగుతూ. రూప అద్దం



ముందర కూర్చుని ముడి విప్పుతోంది. రవి మంచంపై వాలుతూ "రెండు రోజులుండవచ్చు కదమ్మా. అప్పుడేనా?" అన్నాడు ఆవులిస్తూ. ట్రంకు పెట్టె శబ్దానికి ఉయ్యాల్లో పిల్లాడు లేచాడు. ఏడువు మొదలెట్టాడు. ఇద్దరూ లేచే ప్రయత్నం చెయ్యలేదు. "రూప వాడి సంగతి చూడు" అన్నాడు రవి.

"అబ్బా. అయామ్ డామ్ టైర్డ్. నువ్వే చూడు రవీ" అంది రూప, తల దువ్వుకుంటూ.

"నే చూస్తాలేమ్మా. వాడు పండుకున్నాడుగా" అంటూ పెట్టెలోంచి చిన్న మూట తీసి లేచి నిలబడింది వెంకమ్మ.

ఇంతవరకు పిల్లవాడిని ఎత్తుకోలేదు. సరిగా చూడలేదు. ఈ వంకతోనయినా ఎత్తుకోవచ్చనుకుంది. "ఇదిగోరా మీ తాత పంపాడు" అంటూ గొలుసు, మురుగులు తొడిగింది. "ఏం పేరు పెట్టాగురా" అంది యధాలాపంగా అడిగినట్లు. "ఏదో ఇంగ్లీషు పేరులేమ్మా, నీకర్థంకాదు" అని చెప్పాడు రవి. కానీ ఆ పేరు అతని మామగారి పేరుకు దగ్గరగా వుంది. వాళ్ళసలు ఆమెని పలకరించనే లేదు. పార్టీ అయ్యాక అటే వెళ్ళిపోయారు.

"ఇవిగో ఇవి మీకు మామగారికి బట్టలు" అంటూ ఇచ్చింది రూప. వాడు ఏడువు ఆపకపోవడంతో ఎత్తుకుంది. "ఇవి ఎంత లావుగా వున్నాయో. చెరిపేస్తే మీకు, వాడికి కూడా అవుతాయి" అంది రూప, పిల్లాడి మెళ్ళో గొలుసు చూస్తూ నవ్వుతూ.

వెంకమ్మ మనస్సు చివుక్కుమంది. నిన్న సాయంత్రం వరకు కంసాలి వద్ద కూర్చుని చేయించాడు భర్త. అప్పుడే మార్చడం గూర్చి ఆలోచిస్తూంది కోడలు. కరిగిపోయిన తన గాజులు గుర్తుకొచ్చాయి. భర్త చెబుతూనే వున్నాడు. తమ కానుకలు వారికి నచ్చవని. అయినా కొడుకు పెద్ద ఆఫీసరు. కోడలు పెద్దింటి పిల్ల. వట్టి చేతులతో ఎలా రావడం. అందుకే డబ్బు చేతిలో లేక గాజులు చెరిపి చేయించింది.

మర్నాడు రైల్లో వెనక్కి వెళుతుంటే భర్త మాటలు, గతం గుర్తుకొచ్చాయి.

"ఇద్దరం వెళదామయ్యా. ఎప్పుడూ ఈ పల్లెటూరేనా? అక్కడేమో అబ్బాయింట్లో సినిమావాళ్ళు, మంత్రులు అందరొస్తారంట. ఫోటోలట, సినిమా తీస్తారట (వీడియో). పోదామయ్యా! బాబు రమ్మన్నాడుగా" అని బ్రతిమలాడింది.

"వెట్టి మొహమా. ఏదో మాటవరసకి పిలిచాడు కానీ అంత పెద్దవాళ్ల ముందర మనమెక్కడే. దిష్టి బొమ్మల్లా వుంటాము. పరువు పోద్ది మనకీ, వాడికీ కూడా" అన్నాడు. వెంకమ్మ వినలేదు. పల్లెటూళ్లో పుట్టి, పల్లెటూళ్లో పెరిగిన వెంకమ్మకి సిటీ చూడాలని ఎంతో కోరిక. కానీ కుదరలేదు. కొడుకు మాత్రం మెరిట్ స్కాలర్‌షిప్‌తో పై చదువులు చదివి పెద్దింటి పిల్లని పెళ్లాడి బస్తీలో స్థిరపడ్డాడు. ఎప్పుడు వెళ్దామన్నా కుదరదు. ఈ వంకతోనయినా వెళ్ళాలని ఆమె కోరిక. చివరికి తెలిసిన వాళ్లు వస్తుంటే ఆమెని పంపాడు భర్త.

గాజులు మార్పిస్తుంటే వద్దంటే కూడా మొండి పట్టు పట్టింది. 'మనవాడికి పెట్టేది నీపేరు. ఖర్చు నాకు' అంది. ఊరంతా ఎన్నో గొప్పలు చెప్పింది. వెళ్లాక అందరూ అడుగుతారు ఎన్నో. ఏం చెప్పాలి? సిటీలో ఎన్నో వింతలుంటాయని వచ్చి చెబుతానని అంది.

కళ్ల ముందర కరిగిన గాజులు, అయిన ఖర్చు మెదిలింది. మళ్లీ కొన్నాళ్లు జొన్న సంకటే గతి. అసలు తనెందుకు వచ్చినట్టు. పెద్దింటికి వంట పని కెళ్లితే సగౌరవంగా సాగనంపినట్టు అనిపించింది. వెంకమ్మ మనస్సంతా భారంగా ఉంది. రైలు సాగిపోతోంది.

— ఆకెళ్ళ వెంకటసుబ్బమ్మ